# కుమ్రం భీం విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 18 : హీరాపూర్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చెందిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కుమ్రం భీం మనుమడు కుమ్రం సోనేరావ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవ లక్ష్మి, ఎంపీ నగేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ గౌష్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, జిల్లాలోని ఆదివాసీ గిరిజన ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, అధికారులు, గ్రామపటేళ్లు, సార్‌మేడిలు, దేవారిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆదే విధంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తొమ్మిది తెగల సమన్వయ కమిటీ ప్రధానకార్యదర్శి కోట్నాక్ బారిక్‌రావ్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భరత్, కార్యదర్శి సోయం రాందాస్, మండల కార్యదర్శి సోయం మురారి, నాయకులు భీంరావ్, హనుమంత్‌రావ్, మెస్రం జైరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఐదు తరగతులు.. ఎనిమిది మంది విద్యార్థులు



విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సోన్, అక్టోబర్ 18 : నిర్మల్ మండలంలోని చిట్యాల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉంది. ఇందులో 21 మంది విద్యార్థుల నమోదు ఉండగా.. ముగ్గురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ' చిట్యాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. అక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మరోవైపు ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా.. ఒకరు వేతన సంబంధిత బిల్లుల నిమిత్తం వెళ్లగా, మరొక ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెంగ్వాపేట్ గ్రామ పాఠశాలకు వెళ్లినట్లు తెలిసింది. ఉన్న ఒక ఉపాధ్యాయుడు ఎనిమిది మంది పిల్లలకు పాఠాలు బోధిస్తూ కన్పించారు.

## మేఘమా.. గణేశుడి రథమా..



రథంపై గణేశుడు ఊరేగిస్తున్నట్లు చిత్రం

బాసర, అక్టోబర్ 18 : బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి రైల్వే స్టేషన్ రహదారి మధ్యలో ఆకాశంలో అద్భుతం ఏర్పడింది. ఆకాశం లోని మేఘాలు గణేశుడిని ఊరేగిస్తున్నట్లు దర్శనమిచ్చాయి. రథంపై గణేశుడిని ఊరేగిస్తున్నట్లు కనిపిస్తున్న ఈ దృశ్యాలను వాహనదారులు, నడక మార్గాన వెళ్లే వారు చూసి కెమెరాలో బంధించారు. ఇది మేఘమా..లేక గణేశుడి రథమా.. అని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## ఎస్సీ వర్గీకరణను చేపట్టేందుకు కుట్రలు చేస్తున్న పార్టీలు

ఎదులాపురం, అక్టోబర్ 18 : రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఎస్సీ వర్గీకరణను చేపట్టేందుకు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ కన్వీనర్ జీ.చెన్నయ్య ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నల్గొండలో ప్రారంభమైన మాలల చైతన్య బస్సుయాత్ర శుక్రవారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. వీరికి జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. చెన్నయ్య మాట్లాడుతూ ఈ నెల 24న చేపట్టే ఛలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి కో కన్వీనర్ చెరుగు రాంచందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు సుధీర్, నాయకులు పాల్గొన్నారు.























